క్లుప్తంగా

ఏఐ ఆధారిత విద్యతో ఉజ్వల భవిష్యత్



రాజాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఏఐ ఆధారిత విద్యా బోధనతో ఉజ్వల్ భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని తిర్మలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట ముగింపు సమావేశంలో ఎంఈఓ మాట్లాడారు. ఏఐ ఆధారిత విద్య అభ్యసించిన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో చేరడానికి అవకాశాలు ఉంటాయన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో తిర్మలాపూర్ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు సమకూర్చినట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధిలో పూర్వవిద్యార్థులు సైతం తమవంతు సహకారం అందిస్తున్నారన్నారు. త్వరలోనే పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు చుక్క నర్సింహులు, సత్యనారాయణగౌడ్, కృష్ణ, మహిపాల్, లింగం, గ్రామస్తులు యాదయ్య, భీమయ్య పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రంలో తనిఖీలు



మిడ్జిల్: మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో గురువారం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మధుసూదన్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించడంతో పాటు వైద్యసేవలపై ఆరా తీశారు. అయితే ఆస్పత్రిలో మందుల కొరత ఉందని రైతులు ఆయన దృష్టికి తీసుకురాగా.. మందుల కొరత లేకుండా చూస్తామని తెలిపారు. అనంతరం బోయిన్‌పల్లి వెటర్నరీ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి శివరాజ్, నర్సింహ ఉన్నారు.

యోగాతో వ్యక్తిత్వ వికాసం




స్టేషన్ మహబూబ్‌నగర్: యోగా సాధనతో ఆరోగ్య సంరక్షణతో పాటు మనోబలం, శాంతి, పరస్పర సహకార భావన, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని టీటీడీ జిల్లా కోఆర్డినేటర్ డా.ఉత్తరపల్లి రామాచారి అన్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానం మహబూబ్‌నగర్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం స్థానిక బండమీదిపల్లిలోని సరస్వతి శిశుమందిరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు పాలుట్ల యాదయ్య గుప్త, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి గంగాధర్ యాదవ్, రాజమల్లేష్, ఎత్తపు కేశవులు, సురేశ్ చందర్ దూత్, హన్మంతురెడ్డి, హెచ్‌ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

'అమెరికా పెత్తనం సరికాదు'



మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రపంచ దేశాలపై అమెరికా పెత్తనం చెలాయించడం సరికాదని.. పాలస్తీనా ప్రజలకు భారత్‌తో పాటు ఇతర దేశాలన్నీ అండగా నిలవాలని సీపీఎం, సీపీఐ, మాస్‌లైన్ నాయకులు ఎ.రాములు, సీహెచ్ రాంచందర్, పి.సురేశ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచ దేశాలపై ఆంక్షలు విధిస్తూ యుద్ధ వాతావరణం సృష్టిస్తున్నారని ఆరోపించారు. అమెరికా ఆయుధాలను విక్రయించుకోవడానికి పాలస్తీనా, ఇజ్రాయెల్, రష్యా, ఉక్రెయిన్, ఇరాన్ దేశాల్లో యుద్ధ బీభత్సం సృష్టిస్తున్నారన్నారు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధాన్ని వెంటనే ఆపాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి చంద్రకాంత్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు.. లీకేజీలమయం



వెన్నాచేడ్ పెద్ద చెరువు

- వెన్నచేడ్ చెరువుకు తూతూ మంత్రంగా మరమ్మతు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

గండేడ్: మండలంలోనే పెద్ద చెరువు అది.. ఆయకట్టు కూడా ఎక్కువే.. తాతల కాలం నాటి పెద్ద చెరువు పునరుద్ధరణకు నోచుకోకవడంతో తూములు శిథిలావస్థకు చేరాయి. వాటికి మరమ్మతు చేయించినా ఫలితం లేకుండా పోతోంది. గతేడాది నీరంతా వృథాగా పోయింది. ఇది వెన్నాచేడ్ పెద్ద చెరువు దుస్థితి. గండేడ్ మండలంలో 11 నోటిఫైడ్ చెరువులు ఉండగా.. ఒక సాలానగర్ ప్రాజెక్టు ఉంది. వీటిలో వెన్నాచేడ్ పెద్ద చెరువు కింద 500 మందికి పైగా రైతులకు 421 ఎకరాల ఆయకట్టు ఉంది. వెన్నాచేడ్ గ్రామంతో పాటు జక్లపల్లి, లింగాయిపల్లి, గొల్లగడ్డ, జానంపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఈ చెరువు నీటితో పంటలు పండించుకుంటారు. ఆయా గ్రామాల రైతులకు ఈ చెరువే ఆధారం. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా వెన్నాచేడ్ పెద్ద చెరువు పునరుద్ధరణకు నోచుకోవడం లేదు.

అడవిలా చెరువు కట్ట..

చెరువు కట్టపై కంపచెట్లు, ముళ్లపొదలు విపరీతంగా పెరిగాయి. గతంలో వాటిని తొలగించినా తిరిగి ఏపుగా పెరగడంతో అడవిలా మారింది. చెట్ల వేర్లు కట్టలోకి చొచ్చుకుపోతుండటంతో బలహీనంగా మారుతోంది. కాల్వల్లో సైతం అక్కడక్కడ చెట్లు పెరగడంతో ఆయకట్టు రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కట్టకు పటిష్టమైన మరమ్మతు లేకపోవడంతో తెగిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఒకసారి కట్టకు వెనకవైపు పెద్ద రంధ్రం పడింది. పూర్తిగా కట్ట తెగిపోయే పరిస్థితి రావడంతో అప్పటి సర్పంచ్ గోపాల్ వెంటనే ఇసుక, మట్టి బస్తాలు వేయించి గండిని పూడ్చివేయించారు. అది తప్పిస్తే ఇప్పటి వరకు ఒక్క మరమ్మతు కూడా చేపట్టలేదు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



తూము వద్ద నీరు వృథాగా పోకుండా మట్టి పోయిస్తున్న ఆయకట్టు రైతులు

తూముకు మరమ్మతు చేయిస్తాం..

వెన్నాచేడ్ చెరువు పెద్ద తూము నుంచి నీరు లీకేజీ అవుతుందని సమాచారం అందింది. గతేడాది మరమ్మతు చేశాం. షెట్టర్ మార్చకపోవడంతో కొంత ఇబ్బంది ఏర్పడింది. కొత్త షెట్టర్ తయారుచేసే వారి కోసం అన్వేషిస్తున్నాం. సంగారెడ్డి, మహబూబ్‌నగర్‌లో షెట్టర్లు తయారుచేసే వారు ఉన్నట్లు తెలిసింది. ఎవరినో ఒకరిని తీసుకువచ్చి రెండు, మూడు రోజుల్లో కొత్త షెట్టర్ బిగిస్తాం. ఈ పనులు వర్షాలు రాకముందే పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నాం.


– రేణుక, ఇరిగేషన్ ఈఈ

రైతులకు తప్పని పాట్లు..

రెండు తూముల కింద ఉన్న కాల్వలు మరమ్మతుకు నోచుకోవడం లేదు. ప్రతి ఏటా సాగు సమయంలో రైతులందరూ కలిసి జేసీబీ సహాయంతో కాల్వల్లో ముళ్లపొదలు, చెట్లను తొలగించి నీరు పారబెట్టుకోవడం తప్ప.. శాశ్వతంగా కాల్వల నిర్మాణం చేపట్టడం లేదు. ఫలితంగా కాల్వలకు చాలా చోట్ల లీకేజీలు ఏర్పడి నీరంతా వాగులోకి వెళ్తుంది. ఈ లీకేజీలను గుర్తించి రైతులు తమ పొలాలకు నీరు పారబెట్టుకోడానికి పడరాని పాట్లు పడుతున్నారు. రాత్రింబవళ్లు కాల్వల వెంబడి తిరగాల్సి వస్తుంది. ఇక పిల్ల కాల్వల పరిస్థితి దారుణంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెన్నాచేడ్ పెద్ద చెరువు పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

మరమ్మతు చేయించినా..

వెన్నాచేడ్ పెద్ద చెరువుకు రెండు తూములు ఉన్నాయి. రెండింటి నుంచి కూడా నీరు లీకేజీ అవుతోంది. చిన్న తూముకు గతంలో మరమ్మతు చేయించినా తిరిగి అదే పరిస్థితి నెలకొంది. లీకేజీ ఎక్కడ ఉందో అధికారులు సైతం గుర్తించలేకపోయారు. అప్పట్లో షెట్టర్ మార్చడంతో పాటు తూముకు కూడా మరమ్మతు చేశారు. అయినా పరిస్థితిలో ఏమార్పు లేదు. పెద్ద తూము నుంచి కూడా నీరు లీకేజీ అవుతోంది. గతేడాది తూతూ మంత్రంగా మరమ్మతు చేయడంతో ఈ ఏడాది లీకేజీ మరింత ఎక్కువ అయింది. ఉన్న నీరంతా వృథాగా పారుతోంది. విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో ఇటీవల మాజీ సర్పంచ్ అనంత లక్ష్మారెడ్డి తూము వద్ద నీరు లీకేజీ కాకుండా మట్టి పోయించారు.



పెద్ద తూముకు మరమ్మతు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

పేదలకు వరం.. సీఎం సహాయనిధి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మహబూబ్‌నగర్ అర్బన్ మండలానికి చెందిన 78 మందికి రూ. 72లక్షల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యం ఇతరత్రా కారణాలతో తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందే పేదలకు ప్రభుత్వం సీఎం సహాయనిధి అందించి అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగా రూ. 5లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ. 10లక్షలకు పెంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.సురేందర్‌రెడ్డి, రమేశ్ యాదవ్, హన్మంతు, ప్రశాంత్, అంజద్, మోసీన్, రాషెద్‌ఖాన్, రఘు, శ్రీనివాసులు, నాగరాజు, మొయిజ్, అశ్వాక్ పాల్గొన్నారు.

హౌసింగ్‌బోర్డు కాలనీని చీల్చవద్దని వినతి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ ఇటీవల జారీ చేసిన డివిజన్ల విభజన నోటిఫికేషన్‌లో హౌసింగ్‌బోర్డు కాలనీని మూడు ముక్కలుగా విభజించడం సరికాదని.. తమ కాలనీని చీల్చకుండా చూడాలని హౌసింగ్ బోర్డు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. గతంలోనూ హౌసింగ్‌బోర్డు కాలనీ ఓటర్లను ఇతర వార్డుల్లో కలిపి తీరని అన్యాయం చేశారన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో డివిజన్‌గా చేసేందుకు హౌసింగ్ బోర్డు కాలనీకి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ.. అధికారులు పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాలనీని మూడు ముక్కలుగా చేయకుండా ప్రత్యేక డివిజన్‌గా గుర్తించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఈసారి జరిగే ఎన్నికలను బహిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు కావన్న, నరేందర్‌రెడ్డి, నగేంద్రం, నవకాంత్‌రెడ్డి, తిరుపతి, భరత్, సునీల్, ఆసిరెడ్డి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదిగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ మండలం రామచంద్రాపురంలో ముదిరాజ్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వరద దశరథ్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, సహాయ కార్యదర్శులుగా కురుమయ్య, పద్మనారాయణ, కార్యవర్గ సభ్యులుగా తిరుతపయ్య, శ్రీను, లక్ష్మయ్య, రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ.. జనాభా పరంగా అధిక సంఖ్యలో ఉన్న ముదిరాజ్‌లు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌ల సత్తా చాటాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు చంద్రుడు, బోల యాదయ్య పాల్గొన్నారు.



ముదిరాజ్ సంఘం గ్రామ కమిటీతో జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్

పీహెచ్‌సీకి ఫ్రిజ్ వితరణ




దేవరకద్ర: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గురువారం జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ ఫ్రిజ్ వితరణ చేశారు. రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా రోగులకు పండ్లు పంపిణీ చేయడానికి కోన రాజశేఖర్ పీహెచ్‌సీకి రాగా.. ఆస్పత్రిలో ఫ్రిజ్ పనిచేయడం లేదని వైద్యాధికారి శరత్ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన.. వెంటనే రూ. 14వేల విలువైన ఫ్రిజ్ కొనుగోలు చేసి ఆస్పత్రి వైద్యులకు అందజేశారు.

పీయూ అధ్యాపకుడికి డాక్టరేట్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో ఎంఎస్‌డబ్ల్యూ డిపార్ట్‌మెంట్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న గాలెన్న ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఓయూ ప్రొఫెసర్ హన్నా ఆనంద్‌రాజు, బీనవేణి రామ్ షెపర్డ్ ఆధ్వర్యంలో 'మహబూబ్‌నగర్ జిల్లాలో రైతుల ఆత్మహత్యలపై' గాలెన్న చేసిన పరిశోధనలకు గాను ఓయూ నుంచి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పీయూ వీసీ శ్రీనివాస్ గాలెన్నను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, అర్జున్‌కుమార్, భూమయ్య, పర్వతాలు, శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, రవికుమార్, వెంకటేశ్, మాధురి మోహన్ పాల్గొన్నారు.

యూనిఫామ్స్ పంపిణీ



దేవరకద్ర: మున్సిపాలిటీ లోని బల్సుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని హెచ్‌ఎం విజయకుమార్ విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని స్రవంతి, కాంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షుడు చంద్రమౌళి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం



అంగన్‌వాడీ చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

మహబూబ్‌నగర్ రూరల్: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారులు తన్వీర్, సుధ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఎదిర, అప్పన్నపల్లి అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు రంగారెడ్డిగూడ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హ్యాండ్‌వాష్ పద్ధతులను వివరించారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. పరిసరాల శుభ్రతతో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ఫార్మసిస్ట్ అనీస్ బేగం, ఏఎన్‌ఎం గౌసియా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



మిడ్జిల్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నవాబుపేటలో..

దేవరకద్ర/స్టేషన్ మహబూబ్‌నగర్/భూత్పూర్/నవాబుపేట/మిడ్జిల్/కోయిల్‌కొండ: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. దేవరకద్ర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కేక్ కట్ చేశారు. అదే విధంగా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేవరకద్ర పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కురుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సూదిరెడ్డి లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

- జిల్లా కేంద్రంలోని మోతీనగర్‌లో పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాజా అజ్మత్‌అలీ ఆధ్వర్యంలో రాహులగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. అదే విధంగా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మహ్మద్ అవేజ్ అహ్మద్ ఆధ్వర్యంలో ఏనుగొండ అనాథ శరణాలయంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు.
- భూత్పూర్ చౌరస్తాలో నిర్వహించిన రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- నవాబుపేట మండల కేంద్రంతో పాటు కొల్లూరులో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసిన అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం, వైస్‌చైర్మన్ తులసీరాం నాయక్, మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నీలకంఠ ఉన్నారు.
- మిడ్జిల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం యూత్ కాంగ్రెస్ నాయకులు విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, గౌస్, వెంకటేశ్‌గౌడ్, బంగారు, ఆదాం, రాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- కోయిల్‌కొండ మండల కేంద్రంలోని వివేకానంద చౌరస్తాలో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు.

లేబర్ కోడ్స్‌తో కార్మికులకు నష్టం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్మికులతో కలిసి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల సాధన కోసం జూలై 9న సార్వత్రిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయడంతో పాటు కనీస వేతనాలను అమలు చేయాలని, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ప్రతి కార్మికుడికి పీఎఫ్, ఈఎస్‌ఐ, బోనస్, గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిల్లె గోపాల్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర నర్సింహులు, సీఐటీయూ పట్టణ కన్వీనర్ వరద గాలెన్న, యాదమ్మ, బాల్‌రాజ్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి



నవాబుపేట: విద్యార్థుల్లో పోటీతత్వం పెంచాల్సిన అవసముందని ఎంఈఓ నాగ్యానాయక్ అన్నారు. పదో తరగతి ఫలితాల్లో 450 మార్కులకు పైగా సాధించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ విద్యార్థులకు గురువారం ప్రగతి సొసైటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రశంసాపత్రాలతో పాటు పై చదువులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. అదే విధంగా మండల టాపర్‌తో పాటు 95శాతం ఉత్తీర్ణత సాధించిన ఆరు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. కొల్లూర్ పాఠశాలకు విన్నర్ ఆఫ్ ది మండల్ పేరుతో అవార్డు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం నాయక్, నిర్వాహకులు డేగా శంకర్, ఎడ్యుకేషన్ ప్రాజెక్టు మేనేజర్ జగదీశ్, మరికంటి రాములు, పాశం గోపాల్, శివకుమార్, శ్రీకాంత్, లావణ్య, శృతి, విజయ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించాలి



మిడ్జిల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని జూలై 7న గ్రామగ్రామానా ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి, జిల్లా ఇన్‌చార్జి బిక్షపతి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 31ఏళ్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమ చరిత్ర, సాధించిన విజయాలను ప్రతి గ్రామంలో ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా ప్రజలకు వివరించాలని సూచించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జంగయ్య, సురేశ్, శివకుమార్, గణేశ్, పరశురాం, ప్రశాంత్, వంశీ, ఆంజనేయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 338 దరఖాస్తులు



నవాబుపేట: మండలంలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులు గురువారంతో ముగిసినట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. చివరి రోజు యన్మన్‌గండ్లలో రెవెన్యూ సదస్సు నిర్వహించగా.. భూ సమస్యలపై 54 దరఖాస్తులు సమర్పించినట్లు పేర్కొన్నారు. కాగా, మండలంలోని 24 రెవెన్యూ గ్రామాల్లో మొత్తం 338 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. ఆయా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవాలి



జడ్చర్ల: అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని వైద్యాధికారులు సూచించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని కోహన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్, ఎఫ్‌డీఎఫ్ యూనిట్–2లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా.. 50 మంది రక్తదానం చేశారు. అత్యధిక సార్లు రక్తదానం చేసిన సచిన్‌ను వైద్యాధికారులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్, డా.శివకాంత్, వెంకటేశ్ పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

దేవరకద్ర: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి గురువారం వచ్చిన డీఆర్‌డీఎల్ డైరెక్టర్ డా.జీఏ శ్రీనివాస్, జనరల్ ఆఫ్ బ్రహ్మోస్ డైరెక్టర్ డా.జైతీర్థ జోషి, బ్రహ్మోస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాంబశివ ప్రసాద్‌లను ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడానికి కావాల్సిన స్థల విషయంపై వారు చర్చించారు.

ఆర్థికసాయం అందజేత

నవాబుపేట: మండల కేంద్రానికి చెందిన బోట్కు కృష్ణయ్య గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. అతడి కుటుంబ సభ్యులను మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి పరామర్శించి, అంత్యక్రియల నిమిత్తం రూ. 5వేల ఆర్థికసాయం అందించారు. అదే విధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో తల్లీ కుమారుడు మృతిచెందగా.. వారి కుటుంబానికి రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట ఆంజనేయులు, నిరంజన్, తిరుపతయ్య, వెంకటయ్య, నర్సింహులు, బాలయ్య, నసీర్ ఉన్నారు.